28న ఆర్ఆర్‌బీ పరీక్షలకు మాక్‌టెస్టు

అరసవల్లి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఎర్రన్న విద్యా సంకల్పంలో భాగంగా ఈ నెల 28న ఆర్ఆర్‌బీ, గ్రూప్-డి పోటీ పరీక్షలకు సన్నద్ధంగా మాక్‌టెస్టును నిర్వహించనున్నారు. ఇందుకోసం శ్రీకాకుళంలోని కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు. "డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.వైవీఎస్‌శ్రీకాకుళం.లైవ్/రిజిస్టర్" ద్వారా అభ్యర్థులు పేర్లు నమోదు చేసుకోవాలి. 28న ఉదయం 10 గంటలకు పరీక్షకు హాజరుకావాలి. జిల్లాలో పోటీ పరీక్షలకు హాజరవుతున్న నిరుద్యోగులకు ఈ మాక్‌టెస్టులు ఎంతగానో ఉపయోగపడతాయ'ని నిర్వాహకులు తెలిపారు.



నూతనోపాధ్యాయురాలికి నియామకపత్రం అందజేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

నిరీక్షణ ఫలించింది

● కొత్త ఉపాధ్యాయులకు నియామక పత్రాలు

శ్రీకాకుళం/ గార రూరల్/నరసన్నపేట/పాతపట్నం/ గుజరాతీపేట, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): వారంతా ఉపాధ్యాయ వృత్తిలో చేరాలని అహర్నిశలు కష్టపడి చదివారు. ఇటీవల నిర్వహించిన మెగా డీఎస్సీలో అర్హత సాధించి.. ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. అమరావతిలోని వెలగపూడి సచివాలయం సమీపంలో ఏర్పాటు చేసిన వేదికపై సీఎం చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా కొత్త ఉపాధ్యాయులు అందరికీ గురువారం నియామక పత్రాలు అందజేశారు. జిల్లాకు సంబంధించి 673 మంది నూతనోపాధ్యాయులను నియామకపత్రాలు అందుకున్నారు. పాతపట్నం నియోజకవర్గం నుంచి 91 మంది అభ్యర్థులు డీఎస్సీలో అర్హత సాధించారు. పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు చెందిన 'ఎంఏఆర్ ట్రస్టు ద్వారా శిక్షణ పొందినవారిలో 21 మంది అభ్యర్థులు ఉపాధ్యాయ కొలువు పొందారు. వారిని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తదితరులు అభినందించారు. వారి చేతుల మీదుగా కొంతమంది అభ్యర్థులు మరోసారి నియామక పత్రాలు అందుకున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాకు చెందిన పలువురు కొత్త ఉపాధ్యాయులు 'ఆంధ్రజ్యోతి'తో ఫోన్‌లో మాట్లాడారు. తమ కల నెరవేరిందని, నిరీక్షణ ఫలించిందని ఆనందం వ్యక్తం చేశారు. బాధ్యతతో ఉపాధ్యాయ వృత్తి చేపడతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆమదాలవలస, నరసన్నపేట, పలాస ఎమ్మెల్యేలు కూన రవికుమార్, బగ్గు రమణమూర్తి, గౌతు శిరీష తదితరులు పాల్గొన్నారు.

రెండో ప్రయత్నంలోనే సాధించా



రెండో ప్రయత్నంలో డీఎస్సీ రాసి ఉద్యోగాన్ని పొందడం ఎంతో ఆనందం ఉంది. తొలిసారి పరీక్షల్లో చేసిన తప్పులు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకున్నా. ప్రణాళికబద్ధంగా. పట్టుదలతో చదవడంతో ఈ విజయం సాధ్యమైంది. ఎలాగైనా ఉద్యోగం సాధించాలనే తపనతో ఏడాదిపాటు ఇంటికి దూరంగా అవనిగడ్డలో ఉంటూ శిక్షణ తీసుకున్నా. నా కష్టానికి తగిన ప్రతిఫలం లభించింది. అన్నయ్య కార్తీక్ కూడా ఉపాధ్యాయుడే. ఆయన ఇచ్చిన స్ఫూర్తితో నేను కూడా ఉపాధ్యాయురాలిని కాగలిగాను.

- వాన దివ్య, జమ్ము, నరసన్నపేట

● ఎంతో ఆనందంగా ఉంది



2016లో డీఈడీ పూర్తిచేశాను. మా తల్లిదండ్రులు 2017లో పెళ్లి చేశారు. పెళ్లి అయిన తర్వాత ఇద్దరు పిల్లలు. ఆవులు పెంచుకుంటూ జీవిస్తున్నాం. ఆవుల ఆలనా పాలన చూస్తూ రాత్రి సమయంలో డీఎస్సీ కోసం ప్రణాళిక బద్ధంగా చదివాను. నా భర్త వెంకటేష్ ఎంతో ప్రోత్సహించారు. పశ్చిమ గోదావరి జిల్లాలో పోస్టులు ఎక్కువగా ఉండటంతో అక్కడ పరీక్ష రాశాను. ఉపాధ్యాయ పోస్టుకు ఎంపికైనట్లు సమాచారం రావడంతో ఎంతో ఆనంద పడ్డాను. నియామక పత్రం అందుకున్న సమయంలో ఉద్వేగానికి లోనయ్యాను. సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్‌కు రుణపడి ఉంటాం.

- శిమ్మ అరుణకుమారి, జమ్ము







ఎమ్మెల్యేలు కూన రవి, మామిడి గోవిందరావు చేతులమీదుగా నియామక పత్రాలు అందుకుంటున్న నూతనోపాధ్యాయులు

● మొదటి ప్రయత్నంలోనే..



మొదటి ప్రయత్నంలోనే ఉపాధ్యాయ ఉద్యోగం సాధించడం చాలా ఆనందంగా ఉంది. 2018లో బీఈడీ పూర్తి చేశాను. 2019లో జరిగిన డిఎస్సీకి దరఖాస్తు చేశాను. అప్పట్లో మా అబ్బాయికి ఆరోగ్యం బాగా లేనందున పరీక్షకు హజరుకాలేపోయాను. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఉపాధ్యాయ నియామకాలు చేపట్టకపోవడంతో చాలా బాధ పడ్డాను. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే డీఎస్సీపై మళ్లీ ఆశలు చిగురించాయి. రోజుకు 12 గంటలపాటు చదివాను. డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ బయోలాజీలో అర్హత సాధించాను.

- కోటెడ్డి దివ్యకుమారి, చిలగాం, గార మండలం

● కష్టం ఫలించింది



2008 సంవత్సరం నుంచి ఉపాధ్యాయ ఉద్యోగం కోసం కష్టపడి చదువుతున్నాను. గతంలో నియామకాలు తక్కువ కావడంతో రెండుసార్లు అర్హత సాధించినా ఉద్యోగానికి ఎంపిక కాలేకపోయాను. ఈసారి మెగా డీఎస్సీ కావడంతో నాలాంటి వారికి చాలా అవకాశం వచ్చింది. పీజీటీ మ్యాథ్స్‌లో అర్హత సాధించాను. మా ఆనందానికి అవధుల్లేవు.

- ఆరంగి ధనుంజయరావు, ఆరంగిపేట, గార మండలం

కల నెరవేరింది



ఎన్నో ఏళ్ల నా కల నెరవేరింది. ఉపాధ్యాయురాలిగా నియామకపత్రం అందుకోవడం ఆనందంగా ఉంది. మాట నిలబెట్టుకొన్న సీఎం చంద్రబాబునాయుడుకు, మామిడి అప్పారావు చారిటబుల్ ట్రస్టు ద్వారా ఉచిత మెగా డీఎస్సీ శిక్షణ కల్పించిన ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు కృతజ్ఞతలు.

- దేవాది సుకన్య, మాకన్నవలస, సారవకోట

వాహనమిత్రకు 10,981 దరఖాస్తులు

టెక్కలి రూరల్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): వాహనమిత్ర పథకానికి జిల్లాలో ఆటో డ్రైవర్ల నుంచి భారీ స్పందన కనిపిస్తోంది. దసరా కానుకగా ఆటోడ్రైవర్లకు వాహన మిత్ర పథకం ద్వారా ఒక్కొక్కరికి రూ.15వేలు చొప్పున అందజేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ఇటీవల దరఖాస్తులు స్వీకరించింది. ఈ నెల 22వ తేదీతో దరఖాస్తుల గడువు పూర్తయింది. కాగా.. జిల్లాలో 10,981 మంది ఆటోడ్రైవర్లు ఈ పథకానికి దరఖాస్తు చేసుకున్నారని సచివాలయ అధికారులు వెల్లడించారు. వీరిలో 10,728 మంది ఈకేవైసీ పూర్తయిందని, 140 మందికి మాత్రమే పెండింగ్ ఉందని తెలిపారు. 113 దరఖాస్తులు అనర్హులుగా గుర్తించినట్టు తెలుస్తోంది. జిల్లాలో అధికంగా రణస్థలం మండలంలో 595 ఆటోలు ఉన్నాయి. తక్కువగా ఎల్.ఎన్.పేట మండలంలో 131 మాత్రమే ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో చాలామంది ఆటోడ్రైవర్లకు ఈ పథకం వర్తించలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అర్హులందరికీ లబ్ధి చేకూర్చేలా చర్యలు చేపడుతోంది.



శ్రీకాకుళంలో జలమయమైన డేఅండ్‌నైట్ జంక్షన్- రైతుబజారు రహదారి

అరగంట వర్షం.. నగరం జలమయం

5లో




సీఎం హెచ్చరికతో.. మార్పు వస్తుందా?

● ప్రైవేటు ఆస్పత్రుల్లో ఇష్టారాజ్యంగా సిజేరియన్లు

● ఏళ్లతరబడి పర్యవేక్షణ కరువు ● వైద్యుల తీరుపై సీఎం చంద్రబాబు ఆగ్రహం

● గర్భిణులకు సురక్షిత ప్రసవంపై అవగాహన కల్పించాలని ఆదేశం



రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రులతో పోల్చితే ప్రైవేటు ఆస్పత్రుల్లో అత్యధికంగా ప్రసవాలు.. సిజేరియన్లు జరుగుతున్నాయి. ఇటువంటివి ప్రభుత్వం అంగీకరించదు. గర్భిణులకు సురక్షిత ప్రసవంపై అవగాహన కల్పించాలి. ఇష్టానుసారంగా సిజేరియన్లు చేయకుండా నిలువరించాలి.

-ఇదీ ఇటీవల ఉన్నతాధికారులకు సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశం

శ్రీకాకుళం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి):

జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో గర్భిణులకు ఇష్టారాజ్యంగా సిజేరియన్లు చేసేస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కొంతమేర సాధారణ ప్రసవాలు జరుగుతున్నా.. ప్రైవేటు ఆస్పత్రుల్లో మాత్రం 90 శాతం సిజేరియన్లు ఉంటున్నాయి. గర్భిణులు పురిటినొప్పులతో ప్రైవేటు ఆస్పత్రికి వెళితే చాలు.. బిడ్డ అడ్డం తిరిగిందని, ఇతరత్రా అనారోగ్య సమస్యలు ఉన్నాయని చెబుతూ.. తల్లీబిడ్డ క్షేమంగా ఉండాలంటే అత్యవసరంగా సిజేరియన్ చేయాల్సిందేనని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. మరికొందరు వైద్యులు ప్రజల సెంటిమెంట్‌ను ఆసరాగా చేసుకుని ముహూర్తం చూసుకోండి.. దాని ప్రకారం ఆపరేషన్ చేసేద్దామని చెబుతూ సిజేరియన్లను ప్రోత్సహిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారు. జిల్లావైద్య ఆరోగ్యశాఖ కానీ, కలెక్టర్ తదితర అధికారులు కానీ ప్రైవేట ఆస్పత్రులపై నిఘా సారించడం లేదు. నిబంధనలు అమలుపై కనీసస్థాయిలో ఆకస్మిక తనిఖీలు కూడా చేయడం లేదు. దీంతో ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులు సిజేరియన్ల పేరుతో గర్భిణుల కుటుంబ సభ్యుల దగ్గర అధిక మొత్తంలో డబ్బులు వసూళ్లు చేస్తున్నారు. ఏళ్ల తరబడి ఇదే తంతు జరుగుతున్నా పట్టించుకున్న నాథులు లేరు.

● ఇదీ జిల్లాలో పరిస్థితి..

జిల్లాలోని ప్రతి వంద ప్రసవాల్లో తొంభై సిజేరియన్‌లే చేస్తున్నారు. సాధారణ ప్రసవం కోసం వైద్యసిబ్బందికి ఆసక్తి చూపకపోవడం.. సిజేరియనే బెటర్ అంటూ చెప్పడంతో గర్భిణులకు 'కోత' తప్పడంలేదు. '2024-25' సంవత్సరంలో జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో 28,846 ప్రసవాలు జరిగాయి. ఇందులో సాధారణ ప్రసవాలు 7,183 కాగా.. 21,663 మందికి సిజేరియన్లు చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు 10,323 ప్రసవాలు అయ్యాయి. ఇందులో సాధారణ ప్రసవాలు 2,498 మాత్రమే. ఏకంగా 7,825 సిజేరియన్లు చేశారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా ప్రసవాల గణాంకాలపై అధికారులతో సీఎం చంద్రబాబునాయుడు సమీక్షించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కన్నా ప్రైవేటు ఆస్పత్రుల్లో ఎక్కువగా సిజేరియన్లు జరుగుతున్నట్టు గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. సురక్షిత ప్రసవాలకు ప్రాధానమివ్వాలని స్పష్టం చేశారు. కాగా.. సీఎం హెచ్చరికతోనైనా (మిగతా 5వ పేజీలో..)

జల్‌జీవన్ మిషన్ పనులు వేగవంతం చేయండి

● నాగావళి ఒడ్డున ఆస్పత్రుల వ్యర్థాలను వేయొద్దు

● తీరప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచాలి

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

5లో



హైమా మృతదేహం

చిచ్చురేపిన కుటుంబ కలహాలు



సంతోష్ (ఫైల్)

● కుమార్తెకు పురుగుమందు తాగించి..

● తాను ఆత్మహత్య చేసుకున్న తండ్రి

6లో

బిల్లు అడిగారని.. తొక్కించి చంపేశాడు

● దాబా యజమాని, అడ్డొచ్చిన వ్యక్తి హత్య

● మద్యం మత్తులో లారీ డ్రైవరు ఘాతుకం



రోదిస్తున్న ఆయూబ్ కుటుంబ సభ్యులు



దండాసి(ఫైల్)



ఆయూబ్(ఫైల్)

కంచిలి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ లారీ డ్రైవర్ దాబాలో భోజనం చేసి.. బిల్లు చెల్లించకుండా ఆ యాజమానితో ఘర్షణకు దిగాడు. ఆపై లారీలో వెళ్లిపోతుండగా.. దాబా యజమాని అడ్డుకునే ప్రయత్నం చేశాడు. అయినా వాహనాన్ని ఆపకుండా దాబా యజమాని పైనుంచి నడిపాడు. దీంతో యజమాని అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనలో లారీని అడ్డుకునేందుకు వచ్చిన మరో వ్యక్తి కూడా గాయపడి చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు. కంచిలి మండలం జలంత్రకోట సమీపాన రఫీక్ (స్టార్) దాబా వద్ద బుధవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఈ ఘటన చోటుకుంది. మృతుల కుటుంబ సభ్యుల్లో విషాదాన్ని నింపింది. ఇందుకు సంబంధించి కంచిలి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

● ఝార్ఖండ్‌లోని కొడర్మా ప్రాంతానికి చెందిన లారీడ్రైవర్ ఇబ్రార్ ఖాన్ పలాస వైపు వెళ్తూ.. బుధవారం రాత్రి 10 గంటల సమయంలో జలంత్రకోటలోని స్టార్ దాబా వద్ద ఆగాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్నాడు. దాబాలో భోజనం చేస్తూ కొంతమంది వ్యక్తులతో వాగ్వాదానికి దిగాడు. దీంతో దాబా యజమాని ఆయూబ్(55).. లారీ డ్రైవర్‌ను వారించాడు. కొద్దిసేపటి తర్వాత 12గంటల సమయంలో ఇబ్రార్ బిల్లు చెల్లించకుండా వెళ్లిపోతుండడంతో ఆయూబ్ అడ్డుకున్నాడు. భోజనం డబ్బులు చెల్లించాలని కోరాడు. అయినా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వాహనాన్ని నడపడంతో ఆయూబ్‌పై నుంచి లారీ చక్రాలు వెళ్లిపోయాయి. దీంతో అక్కడికక్కడే ఆయూబ్ మృతి చెందాడు. ఈ ఘటన దూరం నుంచి గమనించిన మధుపురం గ్రామానికి చెందిన డొక్కరి దండాసి(65) లారీని ఆపేందుకు ప్రయత్నించాడు. లారీడ్రైవర్ అతడిపై నుంచి కూడా వాహనాన్ని దూసుకెళ్లడంతో దండాసి కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. అప్పటికీ లారీని ఆపలేదు. స్థానికులు వెళ్లి.. బూరగాం గ్రామ సమీపంలో లారీని నిలుపుదల చేయించారు. తీవ్రంగా గాయపడిన దండాసిని సోంపేట ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలో మృతి చెందాడు. సోంపేట సీఐ మంగరాజు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సోంపేటలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. లారీడ్రైవర్‌ను అరెస్టు (మిగతా 5వ పేజీలో..)



కొత్తమ్మతల్లికి ముర్రాటలు తీసుకెళ్తున్న భక్తులు

ముగిసిన కొత్తమ్మతల్లి శతాబ్ది ఉత్సవాలు

● చివరి రోజు భారీగా తరలివచ్చిన భక్తులు



కొత్తమ్మతల్లి

కోటబొమ్మాళి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): కోటబొమ్మాళిలో కొత్తమ్మతల్లి శతాబ్ది ఉత్సవాలు అంబరాన్ని తాకాయి. మంగళవారం ప్రారంభమైన ఈ ఉత్సవాలు గురువారంతో అత్యంత వైభవంగా ముగిశాయి. వేకువజాము నుంచే వేలాదిమంది భక్తులు బారులుదీరి కొత్తమ్మతల్లిని దర్శించుకున్నారు. చీరలు, ముర్రాటలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కొత్తపేట జంక్షన్ నుంచి కోటబొమ్మాళి వరకు రెండు కిలోమీటర్ల పొడవునా రోడ్డు భక్తులతో నిండిపోయింది. పగటివేషాలు, కొయ్య డ్యాన్సులు భక్తులను అలరించాయి. పలువురు దాతలు భక్తులకు మంచినీటి ప్యాకెట్లు, మజ్జిగ పంపిణీ చేశారు. సత్యసాయి సేవాసమితి సభ్యులు భక్తులసేవలో పాల్గొన్నారు. టెక్కలి సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎస్ఐ సత్యనారాయణతో పాటు సుమారు 800 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఉత్సవాల్లో హెలీ టూరిజం, శోభాయాత్ర, విద్యుద్దీపాలంకరణ, జానపద, సాంఘిక నాటకాలు భక్తులకు అలరించాయి.

ఆకట్టుకున్న క్రాకర్స్ షో

కొత్తమ్మతల్లి ఉత్సవాల సందర్భంగా స్థానిక బాలుర జిల్లా పరిషత్ క్రీడా మైదానంలో గురువారం రాత్రి ఏర్పాటు చేసిన క్రాకర్స్ షో ఆకట్టుకుంది. వివిధ రకాల క్రాకర్లను కాల్చడం.. విన్యాసాలు చేయటంతో చూపరులు ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి వాకచర్ల రాధాకృష్ణ, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కోరాడ గోవింద్, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు. మెయిన్‌రోడ్డులో విజయనగరం బృందం నిర్వహించిన జానపద నృత్యాలు, కొత్తమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో ఊడికలపాడు, శ్రీకాకుళానికి చెందిన బృందాల కోలాటం అలరించింది.

కెనడా ఐసీఏవో సదస్సులో కేంద్రమంత్రి రామ్మోహన్ 5లో

వైద్యుల నిర్లక్ష్యంతో బాలింత మృతి చెందిందని..

● అలికాం-బత్తిలి రోడ్డుపై గ్రామస్థుల బైఠాయింపు 6లో

ఉప్పొంగిన పెద్దగెడ్డ

● రాకపోకలకు అంతరాయం



ద్విచక్ర వాహనాన్ని ఎత్తి తీసుకు వస్తున్న యువకులు

లావేరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అదపాక, బుడుమూరు మీదుగా ఉన్న పెద్దగెడ్డ గురువారం పొంగి ప్రవహించడంతో గుర్రాల పాలెం, పాత, కొత్తకుంకాలు, పెద కొత్తపల్లి, పైడాయవలస, ఎల్‌ఎన్ పురం, ఇజ్జుపేట తదితర గ్రామాల ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. బుధ, గురువారాల్లో చీపురుపల్లి, గరివిడి, ఆకుల ములగాం తదితర ప్రాంతాల్లో భారీగా వర్షం కుర వడంతో గెడ్డ ప్రవాహం అధికమైంది. అదపాక- గుర్రాల పాలెం మార్గంలో వంతెనపైనుంచి నీరు ప్రవహించింది. గుర్రాలపాలెం నుంచి అదపాక వెళ్లే వారిని కొంతమంది యువకులు గెడ్డను దాటించారు. అదపాక గెడ్డ వద్ద వంతెనను నిర్మించాలని వారు కోరుతున్నారు.

బుడగట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్ ఏర్పాటు చేయాలి

● అసెంబ్లీలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్ఈఆర్

● రూ.126 కోట్లతో నిర్మాణానికి మంత్రి ప్రకటన



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

రణస్థలం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల నియోజకవర్గంలో బుడగట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్ ఏర్పాటు చేయాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు కోరారు. ఈ మేరకు గురువారం శాసనసభలో రాష్ట్రంలో ఓడరేవు ల నిర్మాణాలు, వాటి ఫలితాలపై మాట్లాడా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. ఓడరేవుల నిర్మాణం వల్ల ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో పాటు ప్రభుత్వానికి మంచి ఆదాయం సమకూరుతుందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచనతో ఈ నిర్మాణాలు చేపడితే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. రాష్ట్రంలో 734 కిలో మీటర్ల సముద్ర తీరం ఉందని, దానిని వినియోగించు కోవాలని సూచించారు. దీనిపై సంబంధిత మంత్రి మాట్లాడుతూ.. బుడగట్లపాలెం హార్బర్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.126 కోట్లతో చర్యలు తీసుకుంటుందని ప్రకటించారు. దీంతో ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు.

'స్వచ్ఛ ఆంధ్ర'లో భాగస్వామ్యం కావాలి



స్వచ్ఛతా ఉత్సవ్ ర్యాలీని నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): 'స్వచ్ఛభారత్-స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్' కలను సాకారం చేయడంలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలని డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్ అన్నారు. సెప్టెంబరు 17 నుండి అక్టోబరు 2 వరకు నిర్వహిస్తున్న 'స్వచ్ఛతాహీ సేవా' కార్యక్రమంలో భాగం గా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో వాకథాన్ ర్యాలీ, స్వచ్ఛతా కార్యక్రమాలను గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత అనేది కేవలం ఒక చర్య మాత్రమే కాదు. అది మన దినచర్యలో ఒక భాగం కావాలన్నారు. శ్రీకాకుళం నగరంలోకి ప్రవేశించే ఆర్చి నుంచి నుంచి వాకథాన్ ర్యాలీ చేపట్టారు. అనంతరం బ్యాంకు పరిసరాల్లో స్వచ్ఛతా కార్యక్రమాన్ని నిర్వహించి, మొక్కలు నాటారు. కార్యక్రమంలో బ్యాంకు రీజినల్ హెడ్ పైడిరాజు, లీడ్ బ్యాంకు మేనేజర్ పేడాడ శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయశాఖాధికారి త్రినాథస్వామి, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ఫార్మసీ రంగంలో మెరుగైన ఉపాధి అవకాశాలు



మాట్లాడుతున్న అసిస్టెంట్ మేనేజర్ జగదీశ్వరరావు

ఎచ్చెర్ల, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఫార్మసీ రంగంలో మెరుగైన ఉపాధి అవకాశాలున్నాయని డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ అసిస్టెంట్ మేనేజర్ కె.జగదీశ్వరరావు అన్నారు. చిలకపాలెం శ్రీ శివానీ ఫార్మసీ కళాశాలలో గురువారం ప్రపంచ ఫార్మసిస్ట్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రయోగాత్మకంగా నేర్చుకుంటే సత్ఫలితాలు సాధించవచ్చన్నారు. ఈ సందర్భంగా పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఫార్మసిస్ట్ ఎస్.సింహాచలం, ఫార్మసీ, ఇంజనీరింగ్ కళాశాలల ప్రిన్సిపాళ్లు రాజ్‌కిరణ్, వై. శ్రీనివాసరావు, కళాశాల యాజమాన్య ప్రతినిధులు వీఎం సాయినాథరెడ్డి, పి.దుర్గాప్రసాద్ రాజు, దుప్పల వెంకటరావు, ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకర సమాజంలో ఫార్మసిస్టుల పాత్ర కీలకం



ఫార్మసీ విద్యార్థినికి జీ ప్యాట్ మంత్ర పుస్తకాన్ని అందజేస్తున్న డాక్టర్ క్రిస్టియన్

ఎచ్చెర్ల, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో ఫార్మసిస్టుల పాత్ర కీలకమని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల (శ్రీకాకుళం) ఫార్మసీ విభాగాధిపతి డాక్టర్ ఆర్‌డీఎల్‌పీ క్రిస్టియన్ అన్నారు. ఎచ్చెర్లలోని శ్రీ వేంకటేశ్వర ఫార్మసీ కళాశాలలో గురు వారం ప్రపంచ ఫార్మసిస్ట్ డే నిర్వహించారు. ప్రపంచ వ్యాప్తంగా ఫార్మ సిస్టుల సంఖ్య పెరగడంతో మెరుగైన ఔషధ వినియోగం, దీర్ఘకాలిక వ్యా ధుల నియంత్రణలో సహాయపడుతున్నారన్నారు. ప్రిన్సిపాల్ డా.కేఈవీ నాగోజీ, వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ తారక రామారావు, ఫార్మాడీ హెచ్‌వోడీ డా.పి.భానోజీరావు, యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

మండపల్లి సర్పంచ్ చెక్ పవర్ పునరుద్ధరణ

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం మండలం మండపల్లి సర్పంచ్ పిట్ట శేషమ్మ చెక్ పవర్ పునరుద్ధరిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ వివరాలిలా ఉన్నాయి.. సర్పంచ్ గ్రామ పంచాయతీ నిధులు ఖర్చులు, చెల్లింపుల విషయంలో ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించకుండా పరిపాలనపరమైన తప్పిదాలు చేశారని గ్రామస్థుడు నల్ల అనిల్‌కుమార్ 2024లో ఫిర్యాదు చేశారు. ఈ అభియోగాలపై అధికారులు విచారించి పంచాయతీరాజ్ చట్టం 1994 ప్రకారం చెక్ డ్రాయింగ్ పవర్‌ను సంబంధిత అధికారులు తాత్కాలికంగా నిలుపు దల చేశారు. దీనిపై ఆమె చెక్‌పవర్ పునరుద్ధరించాలని కోరుతూ హైకోర్టులో రిట్ పిటిషన్ వేశారు. దీనిపై పరిశీలన అనంతరం చెక్ పవర్ పునరుద్ధరిస్తూ హైకోర్టు ఆదేశించిందని తెలిపారు. హైకోర్టు ఆదేశాల మేరకు చెక్ పవర్‌ను పునరుద్ధరిస్తూ డీపీవో ఉత్తర్వులు జారీచేశారన్నారు.

సౌత్‌జోన్ పోటీలకు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు

ఎచ్చెర్ల, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం బెల్గాంలో వచ్చే నెల 7న జరగనున్న కబడ్డీ సౌత్‌జోన్ పోటీలకు శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ఎంపికైనట్లు డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ తెలిపారు. వీరంతా నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఈనెల 22, 23 తేదీల్లో జరిగిన కబడ్డీ, ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారన్నారు. వీరిని డైరెక్టర్ బాలాజీ, ఏవో డాక్టర్ ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ డాక్టర్ ఎం.శివరామకృష్ణ, వెల్ఫేర్ డీన్ జి.రవి, పీడీలు అభినందించారు.

జల్‌జీవన్ మిషన్ పనులు వేగవంతం చేయండి



కాలువ పూడికను తీయిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): జల్‌జీవన్ మిషన్ పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఇంటికీ సురక్షిత తాగునీరు అందించడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. కుళాయి కనెక్షన్ ఇవ్వడం, సోర్స్ ఉన్న చోట నుంచి వేరే ప్రాంతానికి నీరు సరఫరా చేయడం, లేనిచోట కొత్త వాటి ని నిర్మించాలన్నారు. పనుల్లో ఎటువంటి ఆలస్యం వహించవద్దన్నారు. జిల్లాలో 4,286 పనులకు అను మతి లభించగా ఇంతవరకు 749 పనులు భౌతికంగా, 304 పనులు ఆర్థికంగా పూర్తయ్యాయన్నారు. మరో 1811 పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఈ పనుల కోసం ఇప్పటికే రూ.825 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. ప్రతీ గ్రామంలో శతశాతం లక్ష్యాలు సాధించాల్సిందేనని స్పష్టంచేశారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ నాగేశ్వరరావు, ఈఈ పి.శంకరబాబు తదితరులు పాల్గొన్నారు.

కాలువల్లోని పూడికలు తొలగించాలి

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మురుగు కాలువల్లో పేరుకుపోయిన పూడికలను తొలగించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. గురువారం ఆయన నగరంలో ఆకస్మికంగా పర్యటించి పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. చాపురం-2 సచివాలయం పరిధిలోని డీసీ సీబీ కాలనీలో వీధులు, రామిగెడ్డ పరిసరాలు, కాలువలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామిగెడ్డలో ఉన్న గుర్రపు డెక్కను తక్షణం తీయాలన్నారు. ఆయన స్వయంగా పర్యవేక్షించి కాలువల్లో పేరుకుపోయిన సిల్ట్‌ను తీయించారు. పీఎన్ కాలనీలోని కాలువలు, అక్కడి నుంచి రైతుబజార్ కూడలి, మాధవ మోటార్సు జంక్షన్, డేఅండ్‌నైట్ సిగ్నల్ వరకు కాలువలు, రోడ్లను పరిశీలించారు. కాలు వల్లో మట్టి పేరుకుపోవడంతో వర్షపు నీరు రోడ్డు పైకి చేరుతోందని, కాలువల్లో చెత్త వేయవద్దని, ప్రతి ఒక్కరూ పరిసరాలను, రోడ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ పీవీవీడీ ప్రసాదరావు, మునిసిపల్ హెల్త్ అధికారి సుధీర్ పాల్గొన్నారు.

నాగావళిలో వ్యర్థాలను వేయొద్దు

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): నగరంలోని నాగావళి నది వంతెన ఇరువైపులా ఆసుపత్రుల వ్యర్థాలను వేయవద్దని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. స్వచ్ఛ ఉత్సవ్‌లో భాగంగా పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకుని 'ఏక్‌దిన్..ఏక్ గంట..ఏక్ సాథ్' పేరుతో గురువారం నాగావళి నది ఒడ్డున చెత్త, కాలువల్లో పూడికలు తీసే కార్యక్రమం చేపట్టారు. నదీ తీరప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ పీవీవీడీ ప్రసాదరావు, హెల్త్ అధికారి సుధీర్, ఇంజినీర్ శ్రీనివాసులు, హార్టికల్చర్ అధికారి వరప్రసాద్, లయన్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారుల సంక్షేమానికి చర్యలు



మాట్లాడుతున్న కమిషనర్ రవి

ఆమదాలవలస, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని వీధి వ్యాపారుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని కమిషనర్ తమ్మినేని రవి అన్నారు. కేంద్ర ప్రభుత్వం మెప్మా ఆధ్వర్యంలో అమలు చేస్తున్న లోక్ కల్యాణ్ మేళాను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. పట్టణంలోని పలు ప్రాంతాలను వెండింగ్ జోన్లుగా విభజించి వారికి కేటాయించిన ప్రదేశాల్లో వ్యాపారం చేసుకోవాలన్నారు. పీఎం స్వానిధి 2.0 ద్వారా తక్కువ వడ్డీకి రుణాలందిస్తోందని, దీనిని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, మెప్మా పీడీ ఎస్.వెంకటరావు, టీడీపీ సీనియర్ నాయకుడు మొదలవలస రమేష్, యూనియన్ బ్యాంకు మేనేజర్ ఎస్.రవికుమార్, డీసీసీబీ మేనేజర్ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాలు పిల్లలకు ఉపకరణాలు

ఆమదాలవలస, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ప్రభుత్వం ఉపక రణాలు అందిస్తోందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని సమగ్రశిక్ష ఏపీసీ ఎస్.శశిభూషణ్ అన్నారు. గురువారం పట్టణంలోని గేటు మున్సిపల్ హైస్కూల్‌లో నియోజకవర్గస్థాయి ప్రత్యేక అవసరాల పిల్లల పరికరాల నిర్ధారణ శిబిరం నిర్వహించారు. కాన్పూర్‌కు చెందిన అలింకో సంస్థ ప్రతినిధులు డాక్టర్ రంజాన్, అజిత్ పరీక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్.వెంకటరావు, జిల్లా సమన్వయాధికారి బుడు మూరు గోవిందరావు, సహ సమన్వయకర్త వి.ఉమా, పలువురు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కెనడా ఐసీఏవో సదస్సులో కేంద్రమంత్రి రామ్మోహన్



కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుకు జ్ఞాపిక అందిస్తున్న ఐసీఏవో ప్రతినిధులు

శ్రీకాకుళం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): కెనడా దేశం మాంట్రియాల్‌లో జరుగుతున్న 42వ ఇంటర్నేషనల్ సివిల్ ఏవియేషన్ ఆర్గనైజేషన్ (ఐసీఏవో) సాధారణ సభలో గురువారం భారత దేశ ప్రతినిధిగా కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఐసీఏవో కౌన్సిల్ అధ్యక్షుడు సాల్వటోర్ షియాక్విటానో, కార్యదర్శి జనరల్ జువాన్ కార్లోస్ సలాజార్‌లతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సభలో పాల్గొనడం అరుదైన గౌరవంగా రామ్మోహన్‌నాయుడు అభిప్రాయపడ్డారు. భారత విమానయానరంగం సాధిస్తున్న వృద్ధిని ప్రస్తావించారు. ఐసీఏవో ఎల్లప్పుడూ అంది స్తున్న సహాయ సహకారాలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గ్లోబల్ ఏవియేషన్‌లో దేశం చూపబోయే భవిష్యత్ విప్లవాన్ని, ఐసీఏవో కౌన్సిల్‌తో పాటు సభ్యదేశాలతో పంచుకోబోయే టెక్నికల్ నైపుణ్యం, స్కిల్లింగ్ అనుభవం వంటి అంశాలపై కేంద్ర మంత్రి వారితో చర్చించారు. ఈ సందర్భంగా ఐసీఏవో స్వీకరించిన తాజా నినాదం 'నో కంట్రీ లెఫ్ట్ బిహైండ్' అనే అంశం, ప్రధాని నరేంద్రమోదీ ఆలోచన 'వసుధైక కుటుంబం' అన్న మాన వతా స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందని రామ్మోహన్‌నాయుడు అన్నారు. ఇంట ర్నేషనల్ సివిల్ ఏవియేషన్ ఆర్గనైజేషన్ ఇచ్చిన ఆదేశానికి భారత్ కట్టుబడి ఉంటుందని వెల్లడించారు. అదే విధంగా సస్టయినబుల్ ఏవియేషన్ ఫ్యూయల్ వినియోగంపై భారత్ తీసుకుంటున్న దృఢమైన చర్యలను.. విమానయాన రంగంలో మరింత మంది మహిళలు పాల్గొనేలా లింగ సమానత్వంతో కూడిన మార్పులను వివరించారు. ఈ సంద ర్భంగా భారత విమానయాన రంగంలో సాధించిన వృద్ధికి గాను ఆర్గనైజేషన్ ప్రతినిధులు రామ్మోహన్‌నాయుడికి అభినందనలు తెలిపారు.

అరగంట వర్షం.. నగరం జలమయం



వర్షపు నీటిలో నుంచే బస్సు ఎక్కుతూ..

శ్రీకాకుళం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో రెండు రోజులుగా ప్రతిరోజు సాయంత్రం కొద్దిసేపు వర్షం కురుస్తోంది. వాతావరణంలో కూడా మార్పులు సంభవించాయి. గురువారం సాయంత్రం అర్థగంట పాటు భారీ వర్షం కురిసింది. నగరంలో ఈ వర్షానికే ప్రజలు గంటపాటు ఇబ్బందులకు గురయ్యారు. జిల్లా అంతటా వర్షపాతం నమోదైంది. నగరంలో ఆర్టీసీ కాంప్లెక్స్‌తోపాటు పలు వీధులు జలమయ మయ్యాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

మీ వస్తువులు మురుగుమయమే!



శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలోని కొరియర్, పార్శిల్ కార్యాలయం ఇది. చిన్నపాటి వర్షం కురిసినా ఈ ప్రాంతం చెరువును తలపిస్తుంది. పరిసరాల్లోని కాలువలో మురుగు నీరంతా ఇక్కడికి చేరుతుంది. మోకాలులోతు నీరు నిలబడు తుంది. ఇతర ప్రాంతాల నుంచి కొరియర్‌లో వచ్చిన వస్తువులను కొన్నింటిని సిబ్బంది బయటే పడేస్తుంటారు. దీంతో వర్షం వచ్చినప్పుడు మురుగునీటిలో ఈ వస్తువులు తడిచి మునిగిపోతున్నాయి. మురుగుమయమై దుర్వాసన వస్తున్న తమ వస్తువులను ఎలా తీసుకెళ్లాలని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కోసారి తమ వస్తువులు పనికిరాకుండా పోతున్నాయని వారు వాపోతున్నారు.

సీఎం హెచ్చరికతో.. మార్పు వస్తుందా?

(మూడో పేజీ తరువాయి)

ప్రైవేటు వైద్యుల తీరులో మార్పు వస్తుందా? అన్న చర్చ సాగుతోంది.

సీఎం ఆదేశం నెరవేరాలంటే..

ఆస్పత్రుల్లో ప్రసవాలకు వస్తున్న వారి వివరాలతోపాటు.. ర్యాండమ్‌గా తనిఖీలను వైద్యాధికారుల బృందం చేపట్టాలి. ఇందుకు పక్క జిల్లా వైద్య బృందం వస్తేనే బాగుంటుంది. గర్భిణీకి సంబంధించిన వైద్యపరీక్షలు.. ఇతరత్రా రిపోర్టులను పరిశీలించాలి. నిజంగా సిజేరియన్ అవసరమైతేనే చేశారా? అన్న విషయాన్ని నిర్ధారించాలి. అలా అయితేనే కొన్నాళ్లకైనా సిజేరియన్లకు కట్టడి పడుతుంది. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రతినెలా కలెక్టరేట్‌లో ప్రసవాలు, సిజేరియన్లపై అధికారులు సమీక్ష చేపట్టాలి. ప్రజాప్రతినిధులు కూడా పాల్గొని సూచనలిస్తే సత్వర ఫలితముంటుంది. లేదంటే కోతలకు అడ్డుపడే అవకాశముండదు.

బిల్లు అడిగారని.. తొక్కించి చంపేశాడు

(మూడో పేజీ తరువాయి)

చేశామని, ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని కంచిలి ఎస్ఐ పారి నాయుడు తెలిపారు.

ఉపాధి కోసం వలస వచ్చి..

దాబా యజమాని ఆయూబ్‌ది ఝార్ఖండ్ రాష్ట్రం. ఉపాధి కోసం 28 ఏళ్ల కిందట ఆయూబ్ సోదరులు ముగ్గురు సోంపేట ప్రాంతానికి కుటుంబాలతో కలిసి వలస వచ్చారు. సోంపేట పట్టణ శివార్లలోను, ఇతర చోట్ల దాబాలు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆయూబ్‌కు భార్య నజీమా బేగం, ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయూబ్ మృతితో కుటుంబ సభ్యులంతా భోరున విలపించారు.

ఘర్షణ ఆపేందుకు వచ్చి..

డొక్కరి దండాసి.. సామాన్య కుటుంబానికి చెందిన పాడి రైతు. ఇతడికి ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు. ఒక కుమారుడు ఆర్మీలో పని చేస్తుండగా, మరో కుమారుడు జలంత్రకోట పంచాయతీ సర్పంచ్. గురువారం రాత్రి దాబాకు పాలను విక్రయించేందుకు వచ్చి, తిరిగి ఇంటికి వెళ్లిపోతున్నాడు. ఆ సమయంలో ఘర్షణ జరుగుతుం డడంతో.. దానిని ఆపేందుకు వచ్చి ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు.

ఎమ్మెల్యే ఎన్ఈఆర్‌పై ఆరోపణలు హాస్యాస్పదం

జిసిగడాం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నారని, అటువంటి వ్యక్తిపై మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందని నాలుగు మండలాల బీజేపీ నాయకులు అన్నారు. గురువారం బీజేపీ అధ్యక్షుడు మండల పైల విష్ణుమూర్తి ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో నేతలు, కార్యకర్తలు ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అభివృద్ధిని చూసి ఓర్వలేక ఎన్ఈఆర్‌పై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి వజ్జపర్తి రఘురాం, ఎచ్చెర్ల కో-కన్వీనర్ సంపతిరావు నాగేశ్వరావు, రణస్థలం, లావేరు, ఎచ్చెర్ల మండలాల పార్టీ అధ్యక్షులు మహంతి అనంతరావు, లుకలాపు అప్పలనాయుడు, సనపల రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేని విమర్శించే అర్హత 'గొర్లె'కు లేదు

రణస్థలం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వర రావును విమర్శించే అర్హత మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్‌కు లేదని జనసేన జిల్లా వైస్ ప్రెసిడెంట్ భూపతి అర్జున్, ఎఫ్ఎస్‌సీఎస్ అధ్యక్షుడు బొంతు విజయకృష్ణ, వడ్డాది శ్రీనివాసరావు అన్నారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. ఐదేళ్లు ఎమ్మెల్యేగా ఉండి నియోజకవర్గాన్ని ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. అవినీతి, అక్రమాలు, భూదందాలు, రౌడీ రాజకీయాలకు పాల్పడినది గొర్లె కిరణ్‌కుమార్ అని విమర్శించారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన 15 నెలల్లో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించిన ఘనత ఎమ్మెల్యే ఎన్ఈఆర్‌దే నన్నారు. కార్యక్రమలో జనసేన నేతలు తమ్మినేని శ్రీను, దన్నాన చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి, స్వావలంబన, ఆర్థిక వ్యవస్థలే దేశానికి పునాది అని భావించి ఆ దిశగా పండిట్ దీన్‌దయాళ్ పాటుపడ్డారని మెప్మా పీడీ ఎస్.వెంకటరావు అన్నారు. యువ భారత్ శ్రీకాకుళం సౌజన్యంతో స్థానిక ప్రభుత్వ ఐటీఐలో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతిని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి శ్రీనివాసరావు పాత్రో, యువజన సర్వీసుల శాఖ సూపరింటెండెంట్ ఎల్.రేఖ, పి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పండిట్ దీన్‌దయాళ్ జయంతి

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పండిట్ దీన్ దయాళ్ జయంతిని గురువారం నిర్వహించారు. బీజేపీ జిల్లా కోశాధికారి వల్లంపాటి కృష్ణ ప్రసాద్.. దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.ఢిల్లీ, ధర్మ, వీకేప్రసాద్ పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కవిటి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): బొరివంక సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఈఈ జి.యజ్ఞేశ్వర రావు తెలిపారు. ఆరోజు 11 కేవీ పనులు చేపడుతున్నందున ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామన్నారు. ఈ కారణంగా బొరివంక, మాణిక్యపురం, కుసుంపురం, బల్లిపుట్టుగ, వరక పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

నేడు మెగా జాబ్‌మేళా

సోంపేట, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొంచాడ రాజేశ్వర రావు డిగ్రీ కళాశాల ఆవరణలో శుక్రవారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.మణికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ జాబ్‌మేళాలో 11 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఉదయం 9 గంటల నుంచి ఈ మేళా జరుగుతుందని, నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సొంత నిధులతో చెరువు అభివృద్ధి

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని బెల్లుపడ గ్రామం త్రినాథ పేట కాలనీలో ని అమ్మోరు చెరువు పూడికలతో నిండిపోవడంతో స్థానికుడు గిన్ని రంగయ్య రెడ్డి స్పందించారు. తన సొంత నిధులు వెచ్చించి చెరువులోని సిల్ట్, పిచ్చి మొక్కలనుతొలగించారు. దీంతో గ్రామస్థులు ఆయనను అభినందించారు. గిన్ని చిన్న, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) పథకంలో 2019 నుంచి 2024 వరకు నిర్మాణాలు చేపట్టి వివిధ దశల్లో నిలిచిపోయిన ఇళ్లను పూర్తి చేయాలని హౌసింగ్ విభాగం సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్ట్ సీహెచ్ మల్లేశ్వరరావు ఒక ప్రకటనలో కోరారు. ఇల్లు లేని పేదవాడు ఉండకూడదనే లక్ష్యంతో కేంద్రప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఇంకా ఇళ్లు లేని వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

క్రైం కార్నర్

చిచ్చురేపిన కుటుంబ కలహాలు

- కుమార్తెకు పురుగు మందు తాగించి..
- ఆత్మహత్య చేసుకున్న తండ్రి

రణస్థలం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలు ఇద్దరి ప్రాణాలు బలిగొన్నాయి. ఓ వ్యక్తి తన కూతురుకు పురుగుమందు తాగించి తానూ ఆత్మహత్య చేసుకున్నారు. రణస్థలం మండలం సంచాంలో ఈ ఘోరం చోటుచేసుకుంది. జేఆర్‌పురం పోలీసులు తెలిపిన వివరాల మేరకు సంచాం గ్రామానికి చెందిన దుపాడ సంతోష్ (40) అనే వ్యక్తి విశాఖలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అక్కడే కుటుంబంతో నివాసముంటున్నాడు. అయితే కుటుంబ కలహాల నేపథ్యంలో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ నేపథ్యంలో సంచాం వచ్చిన సంతోష్ ముందుగా పురుగుమందు తాగాడు. తర్వాత కుమార్తె షైమాకు తాగించాడు. సంతోష్ అక్కడికక్కడే చనిపోయాడు. తీవ్రఅస్వస్థతకు గురైన షైమాను కుటుంబసభ్యులు శ్రీకాకుళంలోని రిమ్స్‌కు తరలించారు. చికిత్సపొందుతూ బాలిక సైతం మృతిచెందింది. షైమా శ్రీకాకుళంలో ఆరో తరగతి చదువుతున్నట్టు సమాచారం. సంతోష్ తండ్రి దుప్పాడ సూర్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు జేఆర్‌పురం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్రవాహనం అదుపు తప్పి యువకుడి మృతి

శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గార మండలం వమరవిల్లి జంక్షన్ వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో ఓ యువకుడు మృతి చెందాడు. మరో వ్యక్తి గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు... శ్రీకాకుళం నగరంలోని రెల్లవీధికి చెందిన అలిగి కిరణ్ (21) ఇటీవల డిగ్రీ ఇటీవల పూర్తి చేశాడు. అతని స్నేహితుడు శరత్‌తో కలసి గార మండలం కళింగపట్నంలో మరో స్నేహితుడి నిశ్చితార్థ వేడుకలకు గురువారం మధ్యాహ్నం వెళ్లారు. సాయంత్రం 5 గంటల ప్రాంతంలో తిరిగి వస్తుండగా వమరవల్లి జంక్షన్ వద్ద కిరణ్ నడుపుతున్న వాహనం ఒక్కసారిగా అదుపు తప్పి.. బోల్తాపడింది. స్థానికుల సమాచారం మేరకు క్షతగాత్రులను 108 వాహనంలో రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ అలిగి కిరణ్ మృతి చెందాడు. శరత్ రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. అందివచ్చిన కొడుకు కిరణ్ మృతి చెందడంతో తల్లిదండ్రులు ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. వారిని ఓదార్చడం ఎవరి తరం కాలేదు. గార ఎస్ఐ చోడిపల్లి గంగరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో కార్మికుడికి గాయాలు

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): హరిపురం గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు గిన్న కేశవరావు కొళిగాంలో విద్యుత్ పనులు చేస్తుండగా షాక్‌కు గురయ్యాడు. దీంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. స్థానికులు సమీపంలోని ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాలతో ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న స్వేచ్ఛావతి ఎలక్ట్రీషియన్ యూనియన్ నాయకులు రంగాల శ్రీను తదితరులు అతన్ని పరామర్శించారు.

లిక్విడ్ ట్యాంకర్ బోల్తా

- తప్పిన పెను ప్రమాదం
- డ్రైవర్‌కు స్వల్ప గాయాలు



క్రేన్‌తో ట్యాంకర్‌ను తీస్తున్న దృశ్యం

జి.సిగడాం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాజాం- చిలకపాలెం ప్రధాన దారి వాండ్రంగి రైల్వే వంతెన సమీపంలో బుధవారం రాత్రి ఇథైల్ ఆల్కహాల్‌తో వెళుతున్న ట్యాంకర్ బోల్తా పడింది. ఒడిశా నుంచి కృష్ణలంక విమానాశ్రయానికి విత్తనాలకు సంబంధించిన లిక్విడ్ ను తరలిస్తున్న ట్యాంకర్ రాజాం- చిలకపాలెం రహదారి మీదుగా వస్తుండగా టైర్ పేలటంతో ఆదుపు తప్పి బోల్తా పడింది. అదృష్టవశాత్తూ ఎటువంటి ప్రాణనష్టం సంభవించలేదు. పెను తప్పడంతో అధికారులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదంలో స్వల్పంగా గాయపడిన డ్రైవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆనందపురం- వాండ్రంగి రైల్వే వంతెన మధ్య బారీ మలుపు కూడా ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. గురువారం జి.సిగడాం పోలీసులు, పొందూరు అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. క్రేన్‌తో ట్యాంకర్‌ను బయటకు తీశారు. ఆ సమయంలో రాజాం- చిలకపాలెం రోడ్డులో గంటల కొద్దీ ట్రాఫిక్ స్తంభించింది. దీంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. ఈ సంఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రామకృష్ణ తెలిపారు.


రోడ్డుపై వాహనాలు బారులు తీరిన దృశ్యం

మేకల చోరీపై కేసు నమోదు

పలాసరూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పలాస మండలం మోదుగులపుట్టి గ్రామానికి చెందిన అవుగాన రమణరావు ఇంటి ఆవరణలో ఉంచిన 5 మేకలను దొంగలు ఎత్తుకుపోయారని బాధితుడు కాశీబుగ్గ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశాడు. తాను వర్షం కారణంగా మేకలను ఒకే చోట కట్టి ఉంచానని, గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనం చేశారని వివరించాడు. మేకల విలువ సుమారు రూ.50వేలు ఉంటుందని తెలిపాడు. బాధితుని ఫిర్యాదు మేరకు కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతి

పాతపట్నం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని విక్టరీ స్కూల్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రతిభా పరీక్షకు విశేష స్పందన లభించిందని ఆపస్ రాష్ట్రకార్య దర్శి దువ్వారి చలపతిరావు తెలిపారు. మూడో తరగతి నుంచి డిగ్రీ వరకూ చదువుతున్న విద్యార్థులకు 'మనం-మన సంస్కృతి' అనే అంశంపై ప్రతిభా పరీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు శరత్ చంద్రపాడి, సంఘ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు మురళీమోహన్‌పాత్రో, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నందిగాంలో...

నందిగాం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా ఆయనకు గురువారం ఘన నివాళులర్పించారు. బీజేపీ ఆధ్వర్యంలో దేవుపురంలో జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్.శ్రీనివాసరావు, జె.పరమేశ్వరరావు, కామరాజు, రామ్‌జీ తదితరులు పాల్గొన్నారు.

కాశీబుగ్గలో...

కాశీబుగ్గ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ సంతమైదానంలో గురువారం దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతిని ఘనంగా నిర్వహించారు. దీన్ దయాల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు పి.వైకుంఠరావు, రామానంద్‌స్వామి, రాజుమోహన్, భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గమ్మ ఉత్సవాలు

- కాత్యాయనిగా అమ్మవారు దర్శనం

జిల్లాలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. నాలుగో రోజు గురువారం కాత్యాయనీదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ ప్రాంతాల్లోని దుర్గాదేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమార్చనలు చేశారు. భవానీ భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.

-ఆంధ్రజ్యోతి బృందం


వజ్రపుకొత్తూరు: బైపల్లిలో కాత్యాయనిగా పూజలు అందుకుంటున్న దుర్గమ్మ


నరసన్నపేట: ఉర్లాంలో కాత్యాయనిగా దుర్గమ్మ


సారవకోట: అవలింగిలో లలితాంబగా ...


నందిగాం: పూజలు చేస్తున్న భవానీ మాలధారులు


హరిపురం: కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు


ఇచ్ఛాపురం: అమ్మవారికి పూలతో అలంకరణ


సోంపేట: కాత్యాయనీదేవి అవతారంలో సోమపోలమాంబ


గార: సతివాడలో కాత్యాయనిగా దర్శనమిచ్చిన దుర్గాదేవి


జలుమూరు: మహాలక్ష్మిగా పూజలందుకున్న ఆదిలక్ష్మి


పాతపట్నం: కాత్యాయనీ దేవిగా నీలమణి దుర్గ

వైద్యుల నిర్లక్ష్యంతో బాలింత మృతి చెందిందని..

- అలికాం-బత్తిలి రోడ్డుపై గ్రామస్థుల బైఠాయింపు
- ట్రాఫిక్‌కు అంతరాయం


అలికాం-బత్తిలి ప్రధాన రహదారిపై ఆందోళన చేస్తున్న లోచన కుటుంబ సభ్యులు, స్థానికులు


లోచన (ఫైల్)

ఎల్.ఎన్.పేట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్కాటిపేట గ్రామానికి చెందిన తొగరాపు లోచన(21) అనే బాలింత శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందింది. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... లోచనను రెండో కాన్పు కోసం ఈ నెల 22న శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు. ఆమె పరిస్థితి అప్పటికే ఇబ్బందికరంగా ఉంది. సాధారణ కాన్పు అవుతుందని చెబుతూ వైద్యులు, సిబ్బంది మంగళవారం వరకు నిరీక్షించారని కుటుంబ సభ్యులు తెలిపారు. మంగళవారం లోచన పరిస్థితి మరింత విషమించడంతో వైద్యాధికారులు వెంటనే ఆపరేషన్ చేసి ప్రసవం చేయించారు. ఆమె ఆడబిడ్డకు జన్మనిచ్చింది. బుధవారం నాటికి లోచన పరిస్థితి తీవ్రంగా విషమించటంతో రిమ్స్ వైద్యులు చేతులెత్తేశారు. అప్పటికప్పుడు విశాఖపట్నం కేజీహెచ్‌కు రిఫర్ చేశారని కుటుంబసభ్యులు తెలిపారు. దీంతో కేజీహెచ్‌కు తరలించి.. పరీక్షలు చేసేటప్పటికే లోచన మృతిచెందిందని అక్కడి వైద్యులు నిర్ధారించారు. దీంతో బుధవారం రాత్రి మృతదేహాన్ని స్వగ్రామం స్కాటిపేటకు తీసుకు వచ్చారు. రిమ్స్ వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే బాలింత లోచన మృతి చెందిందని కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్థులు ఆరోపిస్తూ గురువారం ఉదయం అలికాం-బత్తిలి ప్రధాన రోడ్డుపై బైఠాయించారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. విషయం తెలుసుకున్న సుబుజ్జిలి ఎస్ఐ బి.హైమావతి సిబ్బందితో కలసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దని మృతురాలి కుటుంబ సభ్యులు, గ్రామస్థులను కోరారు. లోచన మృతికి వైద్యుల నిర్లక్ష్యం కారణమైతే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. దీంతో వారు ఆందోళనను విరమించారు. మృతురాలికి భర్త ఉదయ్‌కుమార్, రెండేళ్ల కుమారుడు ఉన్నారు.

నా బిడ్డ మృతికి కారణం చెప్పరేం?

- నాలుగేళ్లు దాటినా సమాచారం ఇవ్వలేదు
- ఓ విద్యార్థి తల్లి ఆవేదన


కుమారుని ఫొటోతో నాగేష్ తల్లి సుందరి, కుటుంబ సభ్యులు

వజ్రపుకొత్తూరు. సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): 'నా కుమారు డు మువ్వల నాగేష్ రణస్థలం పోలీస్ స్టేషన్ సమీపంలో నాలుగున్నరేళ్ల క్రితం సగం కాలిన స్థితిలో విగతజీవిగా కనిపించాడు. అప్పటి నుంచి ఇప్పటి వరకు నాగేష్ మృతికి గల కారణాలను పోలీసులు వెల్లడించలేదు. కనీసం పోస్టుమార్టం... ఫైనల్ రిపోర్టు కూడా అందించలేదు. ఎందరో నాయకులను కలిశాను. న్యాయం చేస్తామన్నారు. ఇంత వరకు ఏం జరిగిందో చెప్పడం లేదని నువ్వలరేవు గ్రామానికి చెందిన మువ్వల సుందరి వాపోయారు. గురువారం విలే కరుల సమావేశం ఏర్పాటు చేసి తనకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. 'నా కుమారుడు నాగేష్ చిలకపాలెం లో గల ఓ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్‌లో చేశాడు. 2021 జన వరి 26వ తేదీ మధ్యాహ్నం వరకు మాతో ఫోన్‌లో మాట్లాడాడు. అదే రోజు సాయంత్రం నుంచి ఫోన్ స్విచ్చాఫ్‌లో ఉంది. 27న ఉదయం జేఆర్ పురం పోలీసు స్టేషన్ పరిధిలో సగం కాలిన మృతదేహం ఉన్నట్లు సమాచారం వచ్చింది. ఇంజనీరింగ్ కళాశాలలోనే నా కుమారుడి మృతికి బీజం పడిందని యాజమాన్యాన్ని నిలదీశాం. అప్పటి వైసీపీ నాయకులు కల్పించుకొని కారణాలు కనుక్కుంటామని చెప్పారు. ఇప్పటి వరకు ఎంతోమంది నాయకు లను, పోలీసు పెద్దలను కలిసినా న్యాయం చేయలేదు. నా కు మారుడు ఇంజనీరింగ్ కళాశాలలోనే మృతి చెందినట్లు అనుమ నాలు ఉన్నాయి. అతని గదిలో రక్తపు మరకలు చూశాం. పేద వారం కావడం వల్లనే మాకు ఇంతవరకు న్యాయం జరగలేద'ని ఆమె దీనంగా విలపించారు. మిగిలిన వారి విషయంలో ఇలాగే చేస్తారా? అని పోలీసులను ప్రశ్నించారు. ఇంతవరకు పోస్టుమార్టం రిపోర్టు అందకపోవడంపై అనుమానాలు ఉన్నాయని తెలిపారు. ప్రభు త్వ పెద్దలు స్పందించి తన కుమారుడి మృతిపై విచారణ వేగవంతం చేయాలని కోరారు.

గౌతు లచ్చన్న బాటలో నడిస్తే బాగుండేది

- అసెంబ్లీలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు
- వైసీపీ నాయకులకు చురకలు



పలాస, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు గౌతు లచ్చన్న బాటలో వెళ్లి ఉంటే బాగుండేదని స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో దివంగత నేత, సర్దార్ గౌతు లచ్చన్న నాయకత్వ లక్షణాలను స్పీకర్ గురువారం ప్రస్తావించారు. ఆయన బాటలో వెళ్లి ఉంటే బాగుండేదని వైసీపీ నాయకులకు చురక అంటించారు. ఆయన ఏమన్నారంటే.. 'అసెంబ్లీలో వైసీపీ నాయకులు మాట్లాడే తీరు ఆక్షేపణీయం. ఒక రాజకీయ పార్టీకి ప్రజాస్వామ్యంపై గౌరవం ఉండాలి. ఈ విధంగా మాట్లాడకూడదు. గెలుస్తుంటాం... ఓడిపోతుంటాం. ఎన్టీయార్, ఇందిరాగాంధీ లాంటివారు ఓడిపోయారు. ఏంటి రఫారఫా మాటలు? రాష్ట్రాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని మాట్లాడాలి. ఇప్పటికే రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు. ప్రజలు కళ్లారా చూశారు. ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలో గౌతు లచ్చన్న పేరును ఇక్కడి సభ్యులు ఎవరైనా విన్నారా? పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష తాతగారు గౌతు లచ్చన్న. మా తాతయ్య కూడా గౌతు లచ్చన్న శిష్యుడు. జనతా పార్టీలో ఉండేవారు. చుక్క గుర్తుపై పోటీ చేసి గెలుపొందారు. 1978లో జనతా పార్టీ తరపున పోటీ చేసి.. రాష్ట్రంలో అతిపెద్ద ప్రతిపక్షంగా నిలిచారు. మొత్తం 60 మంది సభ్యులు గెలిచారు. అప్పటి ప్రభుత్వం గౌతు లచ్చన్నకు ప్రతిపక్ష హోదా ఇచ్చింది. కానీ అందులో అనేక మంది వ్యక్తిగత కారణాల వల్ల పార్టీ మారారు. ఆనాడు గౌతు లచ్చన్నను ప్రతిపక్ష హోదా నుంచి దిగిపొమ్మని ఎవరూ అడగలేదు. ఒకరోజు సభకు వచ్చి... తనకు ప్రతిపక్ష హోదాకు అర్హత లేదని చెప్పారు. ప్రతిపక్ష నేతగా ఒప్పుకోలేదు. అదీ రాజకీయ నాయకత్వ లక్షణం అంటే. ప్రస్తుత వైసీపీ నాయకులు ఆయన బాటలో వెళ్లి ఉంటే ఎంతో గౌరవం ఉండేది' అని అన్నారు. ఎమ్మెల్యే శిరీష మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సర్దార్ గౌతు లచ్చన్న శిష్యులు ఉన్నారని తెలిపారు. స్వార్థమెరుగని నేత గా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా ఆయన నిలిచారని గుర్తు చేసుకున్నారు.

రోగులకు పౌష్టికాహారం పంపిణీ

పలాస, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక సామాజిక ప్రభుత్వ ఆసుపత్రిలో ముగ్గురు క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లను గురువారం అందించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ టి.పాపినాయుడు మాట్లాడుతు నిక్షయ్ మిత్ర కార్యక్రమంలో భాగంగా పోషకాహార కిట్లు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్‌నర్స్ ఉమాదేవి, మేటి అసిస్టెంట్ అమ్మాజి, ఆసుపత్రి ల్యాబ్ టెక్నీషియన్ శివప్రసాద్, ఢిల్లీరావు, టీబీ సూపర్‌వైజర్ కోటేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ ఉదయభాస్కర్, ఫిజియోథెరపిస్ట్ మనోజ్‌కుమార్, శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

కోల్డ్ స్టోరేజ్‌ను ఏర్పాటు చేయాలి

మెళియాపుట్టి/పాతపట్నం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పాతపట్నం నియోజకవర్గంలో కోల్డ్‌స్టోరేజ్ ఏర్పాటు చేయాలని మంత్రి అచ్చెన్నాయుడును ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. ఈమేరకు ఆయనకు వినతిపత్రం అందించారు. గిరిజనులు కొండలపై పండిస్తున్న పంటలకు గిట్టుబాటు ధర వచ్చేంత వరకు నిల్వ చేసుకునే అవకాశం లేక మద్దతు ధర కోల్పోతున్నారని తెలిపారు. కోల్డ్‌స్టోరేజ్‌ను నిర్మిస్తే గిరిజనులకు మేలు జరుగుతుందని వివరించారు.


మంత్రి అచ్చెన్నకు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పరిశుభ్రతతోనే ఆరోగ్యం


శ్రమదానం చేస్తున్న ఆర్డీవో తదితరులు

హరిపురం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజలకు ఆరోగ్యం, ఆనందం లభిస్తాయని ఆర్డీవో జి.వెంకటేష్ అన్నారు. మందస మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో గురువారం స్వచ్ఛతా సేవా-2025 కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మిస్కా శ్రీకాంత్, డీటీ రామకృష్ణ సర్వేయర్ బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొత్తూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): కొత్తూరు మండలంలోని వివిధ గ్రామాలకు ఈనెల 27న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఏఈ ఇ.నరసింహకుమార్ తెలిపారు. కొత్తూరు, కర్లెమ్మ, మహాసింగి, కుంటిబద్ర, పారాపురం, వసప కాలనీ, సిరుసువాడ, గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఆయన తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

ఆర్టీసీ బస్సు వేళల మార్పు

పలాస, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి పలాస మండలం బ్రాహ్మణతర్లా-కేశపురం గ్రామాలకు వెళ్లే ఆర్టీసీ బస్సు వేళల్లో స్వల్ప మార్పులు చేశామని డిపో మేనేజర్ ఎంఎస్ఎస్ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం నాలుగున్నర గంటలకు పలాస నుంచి వెళ్లాల్సిన బస్సు ఇకపై సాయంత్రం 5.15 గంటలకు వెళ్తుందన్నారు. బస్సు వేళలు మార్చాలని విద్యార్థులు తహసీల్దార్ కళ్యాణచక్రవర్తికి వినతిపత్రం అందించారని.. వారి అభీష్టం మేరకు సాయంత్రం గంట సమయం పొడిగించినట్టు తెలిపారు. ప్రయాణికులు సమయం మార్పు విషయాన్ని గమనించాలని కోరారు.

రైతులందరికీ ఎరువులు

పలాస రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అర్హులైన రైతులందరికీ ఎరువులను అందజేస్తామని తహసీల్దార్ టి.కల్యాణచక్రవర్తి అన్నారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'లో 'ఎరువుల కోసం పడిగాపులు' శీర్షికన కథనం ప్రచురితం కావడంతో ఆయన స్పందించారు. కాశీబుగ్గలోని ఓ ప్రైవేటు షాపు వద్ద ఎరువుల పంపిణీని పరిశీలించారు. రైతుల వివరాలు సేకరించి మాన్యువల్‌గా అందజేయాలని సూచించారు. ఎటువంటి గొడవలు జరగకుండా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు.

కొండచిలువ కలకలం



మెళియాపుట్టి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అంపురం గిరిజన గ్రామంలో ఆరు అడుగుల కొండ చిలువ కలకలం రేపింది. గురువారం గ్రామంలోకి వచ్చిన కొండచిలువ కోడిని మింగడానికి ప్రయత్నిస్తుండగా... గ్రామస్తులు గమనించి హతమార్చారు.

అవగాహనతోనే ఎయిడ్స్ నియంత్రణ

పాతపట్నం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అవగాహనతోనే ఎయిడ్స్ నియంత్రణ సాధ్యపడుతుందని సీహెచ్‌సీ వైద్యాధికారి డా.జి. వేణుగోపాలరావు తెలిపారు. స్థానిక సీహెచ్‌సీ ప్రాంగణంలో హెచ్ఐవి నియంత్రణపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వై.రఘు స్వీ, ఐసీటీసీ కౌన్సిలర్ జి. బాబూరావు, హెడ్ నర్స్ జి.భారతీకుమారి పాల్గొన్నారు.